

# గీతావాహిని

**ఉషశ్రీ**

ఉషశ్రీ మిషన్

రేడియో కాలనీ, విజయవాడ - 520 008

**GEETAA VAAHINI**
**Ushasri**

© Ushasri Mission

*Cover design :* Bapu

Ushasri Mission
Radio Artistes' Colony
Vijayawada - 520008

*Third Edition :* 2008

*For copies:*
**Dr.GayatriDevi**
Mumbai
Ph: 022-22183149

**Ushasri Mission**
Vijayawada Ph: 9848113681
Hyderabad Ph: 9848598797

*Printed at*
**SriSri printers**
Vijayawada-2
Ph. (0866) 2433359
Cell : 94906 34849

Price : Rs. 30/-
$. 5

---

**ఆర్ష భారతి వికాస పరిషత్ సౌజన్యంతో....**

# ముందుమాట

ఇహపరాలు రెండూ ప్రధానమే. ఆ రెండింటినీ అనుసంధానం చేసిన మహోదాత్త తత్వ శాస్త్ర గ్రంథం గీత. శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీత నిఖిల మానవులకూ ఉత్తమ జీవనమార్గాన్ని, పారమార్థిక చింతననూ తరతరాలుగా అందిస్తున్నది.

గీతను చేతబట్టి దేశదేశాల మేధావులనూ, తత్వవేత్తలనూ ఆశ్చర్యచకితులను చేసి పాదాక్రాంతులను చేసుకున్నాడు స్వామి వివేకానందుడు. ఈ నాటికీ ఎందరో స్వాములూ, గురువులూ గీతాజ్ఞానంతోనే ప్రపంచమంతటా గురువులుగా గౌరవింపబడుతున్నారు.

ఆధ్యాత్మిక గురువులే కాదు, బిజినెస్ మేనేజ్‌మెంటు గురువులు కూడా భగవద్గీతా సారాన్ని తమకోర్సుల్లో భాగం చేసుకున్నారు, సమర్థ వంతంగా కార్యనిర్వహణ చెయ్యాలంటే గీత అవసరం అని.

మానసిక ఒత్తిడి దూరం చేసుకోవడానికి భగవద్గీతనే సూచిస్తున్నారు నిపుణులు.

ఇందుకలదందు లేదని సందేహము వలదు
ఎందెందు వెదకి చూచిన అందందే కలదు 'గీత'

భగవద్గీతని వయసు మళ్ళిన వారు పారాయణం చెయ్యడం కాదు, యువత చదవాలి, చదివి అర్థం చేసుకుని, ఆచరించాలి అనేవారు ఉషశ్రీ. విదేశాలకు వెళ్ళిన మన విద్యార్థులు, అక్కడివారు గీత గురించి ప్రస్తావిస్తే తెల్లమొహం వేసే పరిస్థితి నుండి బయటపడాలి అనేవారు.

ఈ జాతిలో మరొక శంకరాచార్యులు, విద్యారణ్యులు, వివేకానందులు ప్రభవించే ముహూర్తం కోసం ఎదురుచూస్తూ, గీతాప్రవచన ప్రబోధాలు సాగాలనే సంకల్పంతోనే తానూ ఈ కృషి చేస్తున్నాను – అంటూ ఉషశ్రీ "గీతావాహిని" రచించారు, సర్వజన రంజకమైన వచనంలో.

ఆ "గీతావాహిని" మీరు కూడా అందుకోండి.

**– ఉషశ్రీ మిషన్**

సెప్టెంబర్ – 2008

# గీతావాహిని

## 1. అర్జున విషాద యోగం

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।
మామకాః పాండవా శ్చైవ కి మకుర్వత సంజయ॥

ఇలా ప్రారంభమైంది భగవద్గీత.

యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతిః ధృవా నీతి ర్మతిర్మమ ॥

అని ముగించారు, భగవద్గీతా శాస్త్రాన్ని.

ధర్మక్షేత్రంలో యోగీశ్వరుడైన కృష్ణుడు కురు క్షేత్రంలో ధనుర్ధరుడైన అర్జునుడు నిలబడి విజయ విభూతులను సాధించారు. ఇది గీతాసారమూ, పరమార్ధమూ.

సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో యుద్ధసన్నద్ధులై నిలిచిన నా బిడ్డలూ పాండురాజనందనులూ ఏం చేశారో చెప్పు అని ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు.

సంజయుడు చెప్పడం మొదలుపెడుతూ : మహారాజా! రణరంగంలో ప్రప్రథమంగా నీ దుర్యోధనుడు ద్రోణాచార్యుల వారి దగ్గరకు వెళ్ళి :

"చూస్తున్నారా! మీ శిష్యుడైన ద్రుపదరాజనందనుడు పన్నిన వ్యూహంతో వారి సేన ఎంత ఘనంగా వున్నదో! అందులో మహాధాను ష్కులూ, శూరులూ అయిన భీమార్జునులతో సమానులైన యోధు లెందరో వున్నారు.

సాత్యకి, విరాటుడు, ద్రుపద, ధృష్టకేతు, చేకితానుడు, పురుజిత్తు, కుంతిభోజుడు, కాశీ, శిబిదేశపాలకులు, యుధామన్యు, ఉత్తమౌజులు, అభిమన్యునితో ఉపపాండవులు వారందరూ మహారథికులే.

మన సేనలో మీ రెరుగనివారు లేరు కాని, కొంచెం జ్ఞాపకం చేస్తున్నా.

మీరున్నారు, మా పితామహులు భీష్మలవారు, కర్ణ, కృపాచార్య, అశ్వత్థామ, వికర్ణ, భూరిశ్రవస ఆదిగాగలవారితో నా కోసం ప్రాణాలు విడవడానికి సిద్ధంగా వున్నవారే వీరందరూ. మరొక్క విశేషం – మన సేన అపరిమితమైనది. పయిగా భీష్మలవారి రక్షణలో వుంది. భీమాభిరక్షితమై వారి సేన మనకంటె అల్పంగా వుంది.

ఇప్పుడు మీరందరూ సావధానులై భీష్మలవారిని రక్షించడంలో అప్రమత్తంగా వుండాలి" అంటూండగా మన సేనాపతి భీష్ములు సింహగర్జన చేసి శంఖం పూరించారు. దుర్యోధనుడికి సంతోషం కలిగింది.

శంఖ భేరీ మృదంగాది యుద్ధవాద్యఘోష మిన్ను ముట్టింది.

పాండవపక్షంలో కృష్ణుడు పాంచజన్యం, అర్జునుడు దేవ దత్తం పూరించగా భీమసేనుడు పౌంద్రశంఖాన్నీ, ధర్మరాజు అనన్త విజయాన్నీ, నకులుడు సుఘోషాన్నీ, సహదేవుడు మణి పుష్పకాన్నీ పూరించారు. అదే సమయంలో వారి సేనలోని ప్రముఖులు సింహనాద, శంఖధ్వానాలు నడిపించారు. భూమినీ, ఆకాశాన్నీ దద్దరిల్లజేసిన ఆ తుములధ్వనులు దార్తరాష్ట్రులకు భీతి కలిగించాయి.

అర్జునుడు నారి బిగిస్తూ : కృష్ణా! ఒక్కసారి మన రథాన్ని ఉభయసేనామధ్యానికి నడిపిస్తే ఆ యోధులలో ఎవరితో పోరాటం నడపాలో చూస్తాను అన్నాడు.

రథాన్ని రెండుసేనల మధ్యభాగానికి నడిపించాడు హృషీకేశుడు.

చూసున్న అర్జునునికి ఎదురుగా భూరిశ్రవస, భీష్మాది పితృ సములూ, పితామహులూ, వారి ప్రక్కనే ద్రోణ, కృపాది గురువులూ, శల్య,

శకుని ఆదిగాగల మేనమామలూ దుర్యోధనాది సోదరులూ, వారి పుత్రులూ, అశ్వత్థామ మొదలగు స్నేహితులూ కనిపించారు.

అందరూ బంధువులే, స్నేహితులే. అటువంటివారితో యుద్ధం చెయ్యాలా! జాలి నిండిన గుండెతో, కంట తడి పెడుతూ:

కృష్ణా! వీరిని చూస్తుంటే నా నోరు ఎండి, అవయవాలు పట్లుతప్పి, శరీరం కంపించి, దేహంలో మంటపుట్టి, మతిభ్రమించి గాండీవం చెయ్యి జారుతోంది. అశుభాన్ని మనస్సు శంకిస్తున్నది. ఆత్మీయులనూ, ఆప్తులనూ రణరంగంలో నేలకూల్చడం శ్రేయస్కరంగా భావించలేకపోతున్నాను.

విజయవాంఛా, రాజ్యకాంక్షా జారిపోతున్నాయి. సిరి సంపదలతో నిండిన రాజ్యమూ, రాజ్యభోగాలూ దేని కయ్యా!

ఈ రాజ్యమూ, భోగాలూ, సుఖాలూఎవరి కోసమయ్యా, యిందరు నిహతు లయాక?

ఈ సామ్రాజ్యం కాదు త్రిలోకాధిపత్యం వచ్చినా అవసరంలేదు, వీరందరినీ చంపడం తప్పని సరిఅయితే. వీరిని సంహరించడంవల్ల సంతోషం రాదు సరిగదా, పాపం చుట్టుకుంటుంది.

వారందరూ లోభంతో కులనాశన, మిత్రద్రోహ పాతక ఫలాలు తెలియనివారు కావచ్చు.

కులక్షయం కులధర్మానికి హాని తెస్తుంది. ధర్మహాని వల్ల అంతా అధర్మపధాన సాగుతారు. అది కులస్త్రీలను తప్పు దారి పట్టించి వర్ణసంకర హేతు వవుతుంది. ఈ సాంకర్యం నరకానికి దారితీస్తుంది. పితృ పితామహులకు పిండోదకాలు లభించక వారుకూడా పతితు లవుతారు.

కులక్షయానికి సాహసిస్తే యిన్ని దోషాలు దిగుతాయి.

రాజ్య సుఖంకోసం యీ సంహారకాండ అంతపాపం నెత్తి కెత్తుకోలేను. వారు తిరగబడి నన్ను సంహరించినా భరిస్తాను కాని నేను మాత్రం యుద్ధం చెయ్యను, అంటూ ధనుర్బాణాలు విడిచి రథం మీద కూలబడ్డాడు.

# 2. సాంఖ్య యోగం

అచ్ఛేద్యోయం అదాహ్యోయం అక్షౌద్యోఽ శోష ఏవచ

నిత్యస్సర్వ గతః స్థాణుః అచలోయం సనాతనః

దుఃఖ భారహృదయంతో కన్నీరు విడుస్తూ కారుణ్య దృష్టితో వున్న అర్జునుని చూస్తూ శ్రీకృష్ణుడు –

కౌంతేయా! ఏమిటీ వ్యామోహం! అపకీర్తికరమూ, నరక హేతువూ అయిన ఊహ అజ్ఞానులకు కలగాలి, నీ వంటివానికి రాకూడదు.

శత్రుసంతాపకరా! ఈ దుర్బలత్వం వున్నదే యిది చాలా నీచమైనది. వీరుడైనవాడు యిలా నపుంసక లక్షణానికి లొంగి దీనాలాపాలు సాగించకూడదు.

అర్జునుడు : ఈ భీష్మద్రోణాది కురు గురు వృద్ధు లందరూ గౌరవస్థానీయులే; అంతటి వారిని యుద్ధరంగంలో నిలబెట్టి యెలా పోరుసాగించడం? యీ మహనీయులను విడిచి భిక్షాటనంతో జీవించడం మేలు వీరిని చంపి యీ రక్తపు కూడు తినడంకంటె.

ఇంతకూ వారిని మనం పరాజితులను చేయడమా వారి చేతులలో నేల కూలడమా అని నేను ఆలోచించడం లేదు, ఎటయినా బాధాకరమే. ఈ దైన్యంలో నాకు కర్తవ్యం బోధపడడం లేదు. ఏది శ్రేయస్కరమో తెలియజెప్పి నడిపించు. అమరాధిపత్యం లభించినా యీ బాధ తగ్గుతుందనే నమ్మకం లేదు, అని విషాదంతో వున్న వానిని చూస్తూనే శ్రీ కృష్ణుడు పరిహసిస్తూ :

పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. ప్రాజ్ఞులైన వారు దేనికీ విచారించరు. నిన్ను చూస్తే మరీ అన్యాయంగా ఈ దుష్టులకోసం శోకిస్తున్నావు. సావధానంగా విను, ఈ రాజులూ మనమూ యిదివరలో వున్నాం. యిక ముందు కూడా వుంటాం, లేకపోవడం అనేది లేదు.

బాల్య, యౌవన, కౌమార, వార్ధక్యాలు శరీరానికి వచ్చినట్లే యీ దేహి మరో దేహాన్ని పొందడం సహజం. అందుకోసం శోకించరాదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1163**

* * *

**Read other books of Ushasri Mission @**

**http://kinige.com/kbrowse.php?via=publisher&name=Ushasri+Mission&id=15**